క్లుప్తంగా

అండర్ బ్రిడ్జి పరిశీలన


అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్

జహీరాబాద్ టౌన్: మండలంలోని రంజోల్, బాబానగర్‌ల మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని గురువారం ఎంపీ.సురేష్ షెట్కార్ పరిశీలించారు. వర్షాలకు రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం సాక్షి దినపత్రికలో నిలిచిపోయిన రాకపోకలు కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. రంజోల్ గ్రామానికి వచ్చిన ఎంపీ అండర్ బ్రిడ్జిని సందర్శించి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సీఎం సహాయనిధితో లబ్ధి

నారాయణఖేడ్: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. నియోజకవర్గంలోని 19 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.6 లక్షల చెక్కులను గురువారం ఖేడ్‌లోని తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. ఖేడ్ మండలం చాప్టా(కె) గ్రామానికి చెందిన ఈరమ్మకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.36 వేలు మంజూరైన చెక్కును యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్ అందజేశారు. నాయకులు విజయ్‌కుమార్, గోరకానాథ్, వాహీద్, ఏక్‌నాథ్ పాల్గొన్నారు.

సోయాబిన్ పంట పరిశీలన


సోయాబిన్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని గొడిగార్‌పల్లిలో రైతులు సాగు చేసిన సోయాబిన్ పంటను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబుల్ అయిల్స్ పథకం కింద కొంద మంది రైతులకు ఉచితంగా డీఎస్‌బీ-34 రకం సోయాబిన్ విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు సాగు చేసిన పంటను వ్యవయసాయ అధికారి హస్నొద్దీన్, ఏఈఓ.సరస్వతీ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంట దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన: సారా జెస్సికా

కంది(సంగారెడ్డి): మహిళలందరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఎద్దు మైలారం సబ్ సెంటర్ వైద్యురాలు సారా జెస్సికా పేర్కొన్నారు. గురువారం మండలంలోని కాశీపూర్‌లో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి మహిళలకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సారా జెస్సికా మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా అవసరమన్నారు. పోషకాహారం తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరిగి రోగాల బారిన పడకుండా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సంగారెడ్డి టౌన్ : సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని ఎన్‌ఎంఎంయూ ఎంటఆర్డీ లక్ష్మీకాంత్ పరాశర్ అన్నారు. గురువారం సంగారెడ్డి, మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట్‌లో ఢిల్లీ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మహిళా సంఘాల కార్యాలయాలు, మహిళా పెట్రోల్ బంకు, పాడి కేంద్రం, వ్యాపారా దుకాణ సముదాయాలను సందర్శించారు. వస్తున్న ఆదాయ అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఢిల్లీ బృందం, పీఎం సెర్ప్ భీమయ్య, డీఎంఎంలు, ఏపీఎంలు, సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కంప్యూటర్లు అందజేత


కంప్యూటర్లను ప్రారంభిస్తున్న సీడీసీ చైర్మన్

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): మండలంలోని కంబాలపల్లి ప్రభుత్వ పాఠశాలకు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి తుల్జారాంసింగ్ రెండు కంప్యూటర్లు అందజేశారు. ముఖ్యఅతిథిగా సీడీసీ చైర్మన్ రాంరెడ్డి హాజరై కంప్యూటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు టెక్నికల్ విద్యను బోధించేందుకు కంప్యూటర్లు దోహదపడుతాయన్నారు. తుల్జారాం సింగ్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామస్తులు ఆయనను అభినందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు బాబు, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కోసం దశాబ్దాల నిరీక్షణ


కేఎస్‌ఆర్ కాలనీలో రోడ్డు దుస్థితి

అమీన్‌పూర్‌లోని కేఎస్‌ఆర్ కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు అయినా నేటికీ రోడ్లు అభివృద్ధి చేయలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ ఆస్తి పన్నులు సకాలంలో చెల్లిస్తున్నా తమ కాలనీలో రోడ్లను అభివృద్ధి చేయడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ రోజురోజుకు విస్తరిస్తోంది. జనాభా పెరుగుతుంది. కొత్త ఇల్లులు నిర్మిస్తున్నారు. అయితే కాలనీలోని రోడ్లను అభివృద్ధి చేయడం లేదని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పటాన్‌చెరు:

మట్టిరోడ్డు కొట్టుకుపోయింది..



కేఎస్‌ఆర్ కాలనీ ఏర్పడి ఇరవై ఏళ్లు అవుతున్నా రోడ్లు అభివృద్ధి కాలేదు. ఉన్న మట్టి రోడ్డు వర్షాలకు కొట్టుకుపోతుంది. ఆరోడ్డుపై నడకకు ఇబ్బందిగా ఉంది. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రోడ్డు వేయించాలని కోరారు.

లావణ్య, గృహిణి

ఆదాయం పొందాలి..ఉపాధి కల్పించాలి

ఎస్‌బీఐ డీఎం డి.రాజీవ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.బి.ఐ డీ.ఎం.డి రాజీవ్ కుమార్

ఝరాసంగం(జహీరాబాద్): బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో మహిళా సంఘాల సభ్యులతోపాటు ప్రతీ ఒక్కరు ఆదాయ మార్గాలను ఎంచుకుని మరికొంతమందికి ఉపాధి కల్పించాలని ఎస్‌బీఐ డీఎం. డి.రాజీవ్ కుమార్, సీజీఎం సహదేవన్ రాధా కిషన్ సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు నెలల ఆర్థిక కేంద్రీకృత ప్రయత్నంలో భాగంగా గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలో 'మెగా జన సురక్ష ప్రచారం'పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బ్యాంకుల ద్వారా అందించే ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలు వాయిదాల ప్రకారం చెల్లించి, తిరిగి రుణాలు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ డిజిటల్ మోసాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. అనవసరమైన లింకులు క్లిక్ చేసి మోసాలకు గురికావద్దన్నారు. తమ అకౌంట్లో నుంచి డబ్బులు కోల్పోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం శ్రీకేతకీ సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సమావేశంలో డీజీఎం జితేంద్ర కుమార్ శర్మ, రీజనల్ మేనేజర్ సిరాజ్ పాషా, ఎంపీడీవో మంజుల తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ప్రత్యేక పూజలు


గంగమ్మను పూజిస్తున్న మత్స్యకారులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం పట్టణ పరిధిలోని మంగంపేట భామన చెరువు, గన్దేవాని, దొరవాణి చెరువులు బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి నిండుకుండలా మారాయి. చెరువుల్లో నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో గ్రామ మత్స్యకార సంఘం అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో సభ్యులు గంగమ్మ తల్లికి పసుపు కుంకుమలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. చెరువులు జలకళలు సంతరించుకోవడంతో ఈ ఏడు పంటలు బాగా పండుతాయని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రఘు, గణేష్, సత్యనారాయణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో స్వచ్ఛభారత్


జిన్నారం(పటాన్‌చెరు): చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న నాయకులు


నారాయణఖేడ్: ప్రదర్శనలో పాల్గొన్న అధికారులు తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పట్టణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపు మేరకు పట్టణాధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి లక్ష్మీనగర్ కాలనీలోని చెత్తాచెదారాలను పార్టీ శ్రేణులతో కలిసి తొలగించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, అఖిల్, సంతోష్, సురేందర్, మోహిత్ పాల్గొన్నారు.

ఖేడ్ మున్సిపాలిటీలో..

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ జగ్జీవన్, మేనేజరు వెంకటశివయ్య, వ్యవసాయశాఖ ఏడీఏ నూతనకుమార్, గృహ నిర్మాణ శాఖ డీఈఈ తివారీ, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ అధికారి శ్రీనివాస్ తదితర అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో ప్రదర్శన నిర్వహించి స్వచ్ఛత ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఆక్సిజన్ పార్కులో చెత్తను తొలగించారు. పలు వార్డుల్లోని మురుగుకాల్వల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి ఖాళీ ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడరు చల్లారు.

ఇన్‌స్పెక్టర్ బదిలీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్ బదిలీ అయ్యారు. రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న గణేష్ కొల్లూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున మరో ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పోషక ఆహారంతో ఆరోగ్యం

సంగారెడ్డి టౌన్: ప్రతి ఒక్కరూ పోషక ఆహారం తీసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిని లలిత కుమారి అన్నారు. గురువారం మండలంలోని అంగడిపేట లో పోషన్ భీ పడాయి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లా డుతూ.. గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు.

నీరు సరఫరా చేయాలని వినతి

జహీరాబాద్ టౌన్: హోతి(కె)వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు నీటి సరఫరా చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు మున్సిపల్ అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మహిపాల్ మాట్లాడుతూ.. ఇటీవల డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారన్నారు. ఇళ్లకు నీటి సరఫరా లేదని, డ్రైనేజీ, కరెంట్ సమస్య కూడా ఉందన్నారు. దసరా పండుగ సందర్భంగా గృహ ప్రవేశాలు చేస్తున్న వారు నీటి సమస్య వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. పండుగను దృష్టిలో పెట్టు కుని నీటి సరఫరా చేయాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శి మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి మిర్జాపూర్(బి) గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్(48)అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. నల్గొండ జిల్లా, నాగార్జున సాగర్‌కు చెందిన రాంప్రసాద్ మండలంలోని మిర్జాపూర్(బి) పంచాయతీ కార్యదర్శిగా సుమారు మూడున్నర ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. చాలా రోజులుగా రాంప్రసాద్ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. గురువారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల నాయకులు మల్లేశం తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక**

నారాయణఖేడ్: పట్టణంలోని ఈ-తక్షిల పాఠశాలకు చెందిన విద్యార్థినిలు మనీషా, శ్రీజ, సాయినిత, అక్షయ అండర్-14, అండర్-17 బాలికల విభాగాల్లో రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శరత్ కుమార్, ప్రిన్సిపల్ అవిక, పీఈటీ శ్రీనాథ్ విద్యార్థినిలను అభినందించారు.

◆ **గణేష్ గడ్డ హుండీ లెక్కింపు**

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారంలోని గణేష్ గడ్డ దేవస్థానం హుండీని గురువారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ ఈఓ లావణ్య సమక్షంలో లెక్కించారు. 78 రోజులకు రూ.24 లక్షల 46 వేలు వచ్చినట్లు ఈఓ లావణ్య , జూనియర్ అసిస్టెంట్లు ఈశ్వర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హుండీ ఆదాయంతో పాటు అన్నదానం హుండీ ఆదాయం రూ. ఒక లక్ష 14 వేలు వచ్చిందని, వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చునున్నట్లు పేర్కొన్నారు.

◆ **బాలల హక్కుల పరిరక్షణకు కృషి**



సంగారెడ్డి టౌన్: బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల హక్కులకు భంగం కలిగించవద్దని, వారి హక్కులను కాపాడాలన్నారు. ఉచిత న్యాయసేవలు కోసం న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చన్నారు.

◆ **దొంగతనం కేసులో మహిళ అరెస్ట్**

జోగిపేట(అందోల్): జోగిపేట బస్టాండ్‌లో జరిగిన దొంగతనం కేసులో మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు. గురువారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 8న మనూరు మండలం ఉసిరికపల్లి గ్రామానికి దిన పార్వతమ్మ జోగిపేట బస్టాండ్ నుంచి వట్టిపల్లికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా ఆమె బ్యాగులో నుంచి 7తులాల అభరణాలు చోరీ చేసిన సంఘటన పాఠకులకు విదితమే. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని హర్చర్ గ్రామానికి చెందిన శ్వేతను అరెస్టు చేసి విచారించగా నేరం ఒప్పుకుంది. ఆమె నుంచి 3 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు చెప్పారు. సంగారెడ్డి కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

◆ **సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి**

పుల్‌కల్(అందోల్) సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో డ్యాంలోకి ప్రవాహం పెరిగింది. దీంతో ఆరు క్రస్టుగేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 50,751 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అంతే నీటిని దిగువకు వదులుతున్నారు.

◆ **మట్టి తరలిస్తే చర్యలు తప్పవు**

వట్‌పల్లి(అందోల్): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ లవకుమార్ హెచ్చరించారు. మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, రెండు జేసీబీ వాహనాలతో పాటు ఎర్రరాయిని తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కొంత కాలంగా వట్‌పల్లిలో సాగుతున్న అక్రమ మట్టి రవాణాపై స్థానికులు రెవెన్యూ, పోలీస్ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అలాగే, సాక్షి దినపత్రికలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో పోలీసులు అక్రమ మట్టి రవాణాపై దృష్టి సారించారు. ఐదు వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేశారు. అక్రమంగా మట్టి రవాణా చేస్తే వాహన యజమానులతో పాటు డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

రేడియల్ రోడ్డు మూసివేత


తాత్కాలికంగా మూసివేసిన రోడ్డు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ ముఖ ద్వారం వద్ద రేడియల్ రోడ్డు వద్ద పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా ఈ సమస్య ఉన్నప్పటికీ అధికారులు పరిష్కారించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేడియల్ రోడ్డు నిర్మాణ సమయంలో రోడ్డు పక్కన వర్షపు నీరు వేళ్లే కాల్వను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో సమస్య జఠిలంగా మారింది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డు పూర్తిగా జలమయం కావడంతో పాటు గుంతలమయంగా తయారయింది. అందులో ద్విచక్ర వాహనదారులు కింద పడిపోవడంతో గురువారం అధికారులు ఆరోడ్డును తాత్కాలికంగా మూసేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. అధికారులు వానాకాలంలో నామమాత్రంగా చర్యలు తీసుకోవడం తప్ప ఏమి చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


విధులను బహిష్కరించిన న్యాయవాదులు

నారాయణఖేడ్: న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి శాంతియుతంగా 48 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. గురువారం పోలీసులు దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ ఖేడ్‌లో బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజిరెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, జనరల్ సెక్రటరీ నర్సింహారావు, సీనియర్ న్యాయవాదులు మారుతిరెడ్డి, లక్ష్మణ్ రావు, నర్సారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జీవన్, రాజు, డ్యాని, ప్రశాంత్, ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆనాటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1972-73లో పదో తరగతి, 1973-75లో ఇంటర్ చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం గురువారం మండలంలోని పెద్దాపూర్ శివారులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. చాలా సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా వారి జీవన స్థితిగతులు పంచుకుని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మైకొసెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు

కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త రమేష్


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమేశ్

సదాశివపేట(సంగారెడ్డి): చిరుధ్యాన్యాల్లో పోషక విలువలు అధికమని, పర్యావరణానికి కూడా అనుకూలమని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రమేష్, స్నేహలత, శైలజ పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం, డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, కృషి విజ్ఞాన కేంద్రం జహిరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో చిరుధాన్యాలు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. చిరుధాన్యాల పోషక విలువ, పర్యావరణానికి అనుకూలత, సేంద్రియ వ్యవసాయానికి అవలంబించాల్సిన మార్గదర్శకాల వంటి అంశాలు, వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు తమ అనుభవాలు, జ్ఞానాన్ని విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగంలో పాత పద్ధతుల ప్రాధాన్యం, సుస్థిర ఆరోగ్యకరమైన వ్యవసాయ విధానాల ప్రాధాన్యం విద్యార్థులకు వివరించారు. అనంతరం సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెనింగ్ గ్రూప్ సభ్యులు విద్యార్థులకు మిద్దె తొటల పెంపకంపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భారతి, వర్క్‌షాప్ కన్వీనర్ ఎస్. సిద్ధులు, కళాశాల అధ్యాపకులు శకుంతల, మురళీకృష్ణ, శరవయ్య, సావిద్య మంజుల, శంకరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులవి స్వార్థ రాజకీయాలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్: స్వార్థ రాజకీయాల కోసం బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రకటనలకు పాల్పడుతున్నారని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గురువారం ఖేడ్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు పట్టణ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని అన్నారు. పట్టణంలో రోడ్డు విస్తరణ చేపట్టకుండా డబ్బులు దండుకొనేందుకే డివైడర్లను నిర్మించారని మండిపడ్డారు. డివైడర్ల వల్ల రోడ్డు కుంచించుకుపోయి రవాణాపరంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. గిరిజన తండాలకు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కుమారుడు రోషన్ రెడ్డి పనులు పొంది ఎన్నికల సమయంలో చేపట్టకుండా వదిలేశాడని మండిపడ్డారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సైదానాయక్

జహీరాబాద్ టౌన్: దసరా పండుగకు ఊరికి వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ పేర్కొన్నారు. గురువారం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచారరథాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పండగలకు సొంత ఊళ్లకు వెళ్లే వారు దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చినట్లయితే ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అనుమానిత వ్యక్తులపై 100 కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ టౌన్ సీఐ.శివలింగం, ఎస్ఐ, వినయ్ కుమార్ ఉన్నారు.

'నారింజ'కు వరద ఉధృతి


ప్రాజెక్టు షెటర్‌ను పైకెత్తిన దృశ్యం

జహీరాబాద్: రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి నారింజ ప్రాజెక్టులోకి వదర నీరు వచ్చి చేరుతోంది. గురువారం ఫారెస్టు అధికారులు మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలోని నారింజ ప్రాజెక్టును సందర్శించింది. ఇన్‌ఫ్లో 4,358 క్యూసెక్కుల మేర వరద నీరు వస్తుండటంతో ప్రాజెక్టులోని ఒక షెటర్‌ను 5 ఫీట్ల మేర ఎత్తారు. దీంతో 4,236 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పక్కన ఉన్న డిడిగి గ్రామంలోని చెరువు నీరు పక్కన ఉన్న ఇండ్లలోకి చేరుతుండటంతో జేసీబీ సహాయంతో ఇరిగేషన్ ఏఈ జానకీరామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రఘు, గ్రామస్తులు మత్తడికి అడ్డంగా ఉన్న మట్టి దిబ్బలను తొలగించారు. నీరు సాఫీగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయడంతో గ్రామ ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.